యథేచ్ఛగా ఫుట్‌పాత్‌ల ఆక్రమణ

- అక్రమంగా వాహనాల పార్కింగ్
- వ్యాపారాలకు అడ్డాగా..
- పాదచారుల ఇబ్బందులు
- తొలగింపులో అధికారుల నిర్లక్ష్యం
- నామమాత్రంగా ఆపరేషన్ రోప్

సైదాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ కష్టాలను తీర్చేందుకు పోలీసులు చేపట్టిన ఆపరేషన్ రోప్ (రిమూవల్ ఆఫ్ అబ్‌స్ట్రక్టివ్ పార్కింగ్ అండ్ ఎన్‌క్రోచ్‌మెంట్-రోప్) విధానం సైదాబాద్, సంతోష్‌నగర్, మలక్‌పేట, చంపాపేట, అక్బర్‌బాగ్ ప్రాంతాలలో జీహెచ్‌ఎంసీ అధికారుల సమన్వయం లేకపోవడంతో నామమాత్రంగా సాగుతోంది. నామమాత్రంగా ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. కూల్చివేతలు జరిగిన ప్రాంతాలలో తిరిగి నిర్మాణాలు జరుగుతున్నాయి.

నడకదారి కనుమరుగు

సైదాబాద్, చంపాపేట, మాదన్నపేట, అక్బర్‌బాగ్ పరిసర ప్రాంతాలలో ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారుల్లో ఫుట్‌పాత్‌లు వాహనాల పార్కింగ్‌కు, వ్యాపారుల అడ్డాలుగా మారుతున్నాయి. దీంతో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోంది. రహదారుల పక్కన ఉన్న వ్యాపార సంస్థలు ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తున్నాయి. కొందరు తమ భవనం ఎదుట ఉన్న ఫుట్‌పాత్‌లను అద్దెకు ఇస్తూ చిరు వ్యాపారుల నుంచి నెలకు వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఫుట్‌పాత్‌లను కబ్జా చేస్తుండడంతో పాదచారులు నడవడానికి ఇబ్బంది పడుతున్నారు.

చూసీచూడనట్లుగా అధికారులు

ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు జోరుగా జరుగుతున్నా ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్‌ఎంసీ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. కొందరు ఫుట్‌పాత్‌లపై వ్యాపారుల వద్ద నెలవారీ మామూళ్లు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఫుట్‌పాత్‌లపై వాహనాలను పార్క్ చేయకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



చంపాపేట ప్రధాన రహదారిలో ఫుట్‌పాత్‌పై పార్క్ చేసిన వాహనాలు

ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగించాలి



సైదాబాద్, అక్బర్‌బాగ్ పరిసరాలలో ఫుట్‌పాత్‌లపై నిర్మాణాలను తొలగించాలి. రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా ఆక్రమణలను తొలగింపునకు చర్యలు తీసుకోవాలి.

- రమణ్‌సింగ్, సైదాబాద్

త్వరలో ఆపరేషన్ రోప్



ఫుట్‌పాత్‌ల ఆక్రమణలపై త్వరలో చర్యలు తీసుకుంటాం. జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో త్వరలో ఆపరేషన్ రోప్ నిర్వహిస్తాం.

- నర్సింహనాయక్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్, సంతోష్‌నగర్

ఆక్రమణలు ఈ ప్రాంతాల్లో..

- చంపాపేటలో కొందరు ఫంక్షన్ హాళ్ల యాజమానులు ఫుట్‌పాత్‌లను ఆక్రమించి కంచె ఏర్పాటు చేసుకుని పార్కింగ్ స్థలాలుగా ఉపయోగించుకుంటున్నారు.
- సైదాబాద్ పీఎస్ నుంచి సరూర్‌నగర్ కట్టకు వెళ్లే దారిలో ఫుట్‌పాత్‌లను ఆక్రమించి భవన సముదాయాలను ఏర్పాటు చేసిన పట్టించుకునే వారే కరువయ్యారు.
- సైదాబాద్ కాలనీ స్టార్ షెల్టర్ అపార్ట్‌మెంట్ వద్ద ఫుట్‌పాత్‌లను ఆక్రమించి డబ్బాలు ఏర్పాటు చేశారు.
- గడ్డిఅన్నారం ప్రధాన రహదారిపై ఫుట్‌పాత్ ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నారు.
- అక్బర్‌బాగ్, మలక్‌పేటలలో ఫుట్‌పాత్‌లపై యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా అడిగే నాథుడే కరువయ్యారు.
- సైదాబాద్ చౌరస్తా సమీపంలో ఫుట్‌పాత్‌లపై అక్రమ నిర్మాణాలను అధికారులు కూల్చివేసినా మరుసటి రోజే తిరిగి నిర్మాణాలు చేపట్టారు.



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

సేవా దృక్పథంతో వైద్యసేవలందించాలి

మన్సూరాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): సేవా దృక్పథంతో వైద్య సేవలందించినప్పుడే ప్రజల నుంచి ఆదరణ లభిస్తుందని భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. నాగోల్ బండ్లగూడలోని ఆనంద్‌నగర్ రోడ్ నంబర్ 2లో ఏర్పాటు చేసిన శ్రీనివాస చిల్డ్రన్స్ ఆస్పత్రిని ఆయనతోపాటు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య ప్రారంభించారు. అధునాతన సదుపాయాలతో ఆస్పత్రి ఏర్పాటు చేశామని, 24 గంటలు వైద్య సేవలు అందిస్తామని డాక్టర్ శ్రీనివాస్‌బాబు తెలిపారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న హయత్‌నగర్ మండల విద్యాధికారి శ్రీనివాస్

విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలి

హయత్‌నగర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తి పెంచుకోవాలని హయత్‌నగర్ మండల విద్యాధికారి కె. శ్రీనివాస్ అన్నారు. స్వయం పరిపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని హయత్‌నగర్ అరుణోదయనగర్ కాలనీలోని లిటిల్ ఏంజిల్స్ పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సోమవారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్తు సైన్స్ పైనే ఆధారపడి ఉంటుందన్నారు. కార్యక్రమంలో హయత్‌నగర్ సీఐ నాగరాజుగౌడ్, పాఠశాల డైరెక్టర్లు స్నేహ, సౌమ్య, ప్రిన్సిపాల్ నరేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కాలనీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

వనస్థలిపురం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కాలనీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. ఎస్కేడినగర్ కాలనీలో సోమవారం ఆయన పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. వాటర్‌వర్క్స్ డీజీఎం రాజ్‌గోపాల్, ఇంజనీరింగ్ ఏఈ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కాలనీవాసులను అడిగి సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి



శివశంకర్‌గౌడ్ తల్లికి ఆర్థిక సాయం అందజేస్తున్న శ్రీధర్‌రెడ్డి తదితరులు

ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన స్నేహితుడి కుటుంబానికి ఆసరా

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మిత్రుడి కుటుంబానికి స్నేహితులు ఆసరాగా నిలిచారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, కవాడిపల్లి గ్రామానికి చెందిన మాచగోని శివశంకర్‌గౌడ్ గత నెల 26న కుంట్లూర్ పాపయ్యగూడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. అతడి కుటుంబానికి స్నేహితులు రూ. 77 వేలు, కాంగ్రెస్ పార్టీ, బాపూజీ యువజన సంఘం తరఫున లక్ష రూపాయలను సోమవారం అందజేశారు. మండల మాజీ ఉపాధ్యక్షుడు కొలన్ శ్రీధర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఇరుగు చిత్తారి, స్నేహితులు రాసాల రాముయాదవ్, కొలన్ కొండల్‌రెడ్డి, ఎర్రకోల్ రవియాదవ్, జాపాల కిట్టుయాదవ్, వేణుగౌడ్, సత్తిరెడ్డి సురి, యాదగిరి, రవీందర్‌రెడ్డి, జంగయ్య, దినేష్ పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాపై విద్యార్థులకు అవగాహన

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణాపై బాటసింగారం జడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. ఎస్‌పీవో అరుణారెడ్డి, మహిళా కానిస్టేబుల్ లలిత యాంటీ ర్యాగింగ్, సైబర్ క్రైమ్, టీ సేఫ్ అప్లికేషన్, డ్రగ్స్, ఈవ్ టీజింగ్, బీఎన్‌ఎస్, బీఎన్‌ఎస్‌ఎస్, బీఎస్‌ఏ చట్టాల గురించి వివరించారు. ఆపదలో ఉంటే వెంటనే డయల్ 100కు, సైబర్ బెదిరింపులు, మోసాలపై 1930, మహిళ హెల్ప్ లైన్-1091, 181, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098/112కు డయల్ చేయాలని సూచించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సంతోష్‌నగర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని డీఈ తెలిపారు. కొత్తపేట, విద్యుత్‌నగర్ ఫీడర్ల పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, హనుమాన్‌నగర్, గోటెట్టి ఫంక్షన్‌హాల్, సాయినగర్ ఫీడర్ల పరిధుల్లోని ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, జైన్‌మందిర్, కమలానగర్ ఫీడర్ల పరిధుల్లోని ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని డీఈ పేర్కొన్నారు.

'ఏసీఏటీ'లో ప్రతిభకనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులు

హైదరాబాద్ సిటీ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ అండ్ అనలిటిక్స్ టెక్నిక్స్ (ఏసీఏటీ) పోటీ పరీక్షలో ప్రతిభ చూపిన 10వ తరగతి విద్యార్థులను అవినాష్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్ చైర్మన్ డాక్టర్ అవినాష్ బ్రహ్మదేవర అభినందించి బహుమతులు అందజేశారు. ఎల్బీనగర్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించిన గుండ్ల వర్షిత్ రెడ్డికి రూ. లక్ష, హిమాన్షు, మహాకు రూ.50 వేలు, జోనల్ టాపర్‌కు రూ.25 వేల చొప్పున అందజేశారు.

440 మంది మద్యం ప్రియులకు రూ. 6,37,800 జరిమానా

కొత్తపేట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి నెలలో ఎల్బీనగర్ ట్రాఫిక్ పీఎస్ పరిధిలో 440 మంది మద్యం ప్రియులపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ దొంగరి వెంకటేశ్వర్లు తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో నాలుగోసారి పట్టుబడి కోర్టుకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతున్న సింగరేణి కాలనీ నివాసి ఎం.జగదీష్(35)ను సోమవారం పట్టుకుని కోర్టులో హాజరుపరిచారు. ఎల్బీనగర్ 6వ స్పెషల్ ఎంఎం కోర్టు జడ్జి అతడికి 2 రోజుల జైలు శిక్ష విధించారని తెలిపారు. మరో ఐదుగురికి ట్రాఫిక్ డ్యూటీ చేయాలని ఆదేశించిందని, మరో ఇద్దరికీ రెండు రోజుల జైలు శిక్ష విధించారని పేర్కొన్నారు. 440 మందికి న్యాయస్థానం రూ. 6,37,800ల జరిమానా విధించిందని తెలిపారు.

హామీల అమలులో రేవంత్ సర్కార్ విఫలం

- ఎమ్మెల్యే సబితారెడ్డి

సరూర్‌నగర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విఫలమయిందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి ధ్వజమెత్తారు. కేవలం రాజకీయం కోసమే సీఎం పని చేస్తున్నారని, ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేశారని ఆరోపించారు. సోమవారం మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడలో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులను ఆమె అందజేశారు. కార్యక్రమంలో బాలాపూర్ డిప్యూటీ తహసీల్దార్ మణిపాల్‌రెడ్డి, భాగ్యనగర్ రైతు సహకార సంఘం చైర్మన్ మర్రి నర్సింహారెడ్డి, బడంగ్‌పేట్ కౌన్సిల్ బీఆర్‌ఎస్ మాజీ ఫ్లోర్ లీడర్ సూర్డగంటి అర్జున్, మాజీ కార్పొరేటర్లు సంరెడ్డి స్వప్నావెంకట్‌రెడ్డి, ఏనుగు రాంరెడ్డి, భీమిడి స్వప్నాజంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కళ్యాణలక్ష్మి చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే సబితారెడ్డి

మునిసిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

మీర్‌పేట్ మునిసిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే సబితారెడ్డి హామీ ఇచ్చారు. పీఎఫ్, ఈఎస్ఐ కింద కట్ చేస్తున్న డబ్బు జమకావడం లేదని, అందరికీ ఈఎస్ఐ కార్డులు ఇవ్వడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మాజీ కార్పొరేటర్ ఎనుగుల అనిల్‌కుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో సబితారెడ్డిని క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. పారిశుధ్య సిబ్బందికి నూనె, సబ్బులు, ఇతర వస్తువులు రెగ్యులర్‌గా ఇవ్వడం లేదని సబితారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.

కార్యక్రమంలో మీర్‌పేట్ కౌన్సిల్ మాజీ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కామేశ్‌రెడ్డి, కో-ఆప్షన్ వజీఈ సభ్యుడు రజాక్, మహిళా విభాగం అధ్యక్షురాలు సునీత పాల్గొన్నారు.



ప్రభుత్వ భూమిని సందర్శించి మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్రాచారి

ప్లాట్లు కొనుగోలు చేసిన వారికే పొజిషన్ ఇవ్వాలి : సీపీఐ

హయత్‌నగర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): అన్మగల్‌లో ప్రభుత్వ భూమి సర్వేనంబర్ 255 అసైండ్ భూమిలో ప్లాట్లు కొనుగోలు చేసిన పేదలకు న్యాయం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారి డిమాండ్ చేశారు. సోమవారం ఎల్బీనగర్ నియోజకవర్గం కన్వీనర్ శేఖర్‌రెడ్డితో కలిసి భూమిని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ కూలీ పనులు చేసుకుని లక్షలు వెచ్చించి స్థలాలు కొనుగోలు చేస్తే సదరు భూమిని రెవెన్యూ అధికారులు హెచ్‌ఎండీఏకు ఏలా కేటాయిస్తారని అన్నారు. కొంతమంది పెద్దలు ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు చేస్తుంటే అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వ భూమిలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారికే పొజిషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దాదాపు 200 మంది పేదలు అసైండ్ భూమిలో ప్లాట్లు కొనుగోలు చేశారని గుర్తు చేశారు. పేదలకు అన్యాయం చేయాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నరసింహ, మండల కార్యదర్శి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహంలో సమస్యలు పరిష్కరించండి

చంపాపేట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రెడ్డికాలనీలోని వసతి గృహంలో సమస్యలు పరిష్కరించాలని దివ్యాంగులు సోమవారం ఆందోళన చేపట్టారు. నెలకు రూ.1.40లక్షలు అద్దె చెల్లిస్తున్నా భవనంలో సరైన వసతులు లేవని, మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయని, ర్యాంపు, లిఫ్ట్ సౌకర్యం లేదన్నారు. పర్మినెంట్ మెన్ వార్డెన్‌ను నియమించాలని, రెండు సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న కాస్మెటిక్ చార్జీలను చెల్లించాలని, మంచాలు, బెడ్స్ ఏర్పాటు చేయాలని, మందులను అందుబాటులో ఉంచాలని, టెస్కోకార్డులు ఇవ్వాలని, పర్మినెంట్ వర్కర్‌లను నియమించాలని, దివ్యాంగులకు కాంటాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న కలెక్టరేట్‌కు వెళ్లలేకపోతున్నామని, వసతిగృహంను రంగారెడ్డి జిల్లా నుంచి హైదరాబాద్ జిల్లాకు మార్చాలని లేదా జిల్లా కార్యాలయంను సరూర్‌నగర్‌లోని ప్రభుత్వ భవనంలో ఏర్పాటు చేసి వారానికి మూడు రోజులు అధికారులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పనిచేస్తున్న వర్కర్లకు వేతనాలు ఇవ్వడం లేదని, కూరగాయలు సరఫరా చేసే వ్యక్తికి బిల్లులు ఇవ్వకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. కాంపిటీటివ్ పరీక్షలకు సిద్ధమవుతున్న దివ్యాంగులకు కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు.



ఆందోళన చేస్తున్న దివ్యాంగులతో మాట్లాడుతున్న రంగారెడ్డి జిల్లా డీడబ్ల్యూఓ సంధ్యారాణి

సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తా

వసతిగృహంలో దివ్యాంగులు ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకున్న రంగారెడ్డి జిల్లా డీడబ్ల్యూఓ సంధ్యారాణి రెడ్డికాలనీకి చేరుకొని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పడంతో దివ్యాంగులు ఆందోళనను విరమించారు.

రైతుల ప్రయోజనాలే ముఖ్యం

- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మార్కెట్లకు పంటలను తీసుకొచ్చే రైతుల ప్రయోజనాలే ముఖ్యం అని గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి అన్నారు. మామిడి సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో మార్కెట్‌కు వచ్చే రైతులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సోమవారం బాటసింగారంలోని పండ్ల మార్కెట్‌లో ట్రాఫిక్, ఫైర్, లా అండ్ ఆర్డర్ పోలీసులు, మార్కెటింగ్ శాఖ అధికారులు, వ్యాపారులు, డైరెక్టర్లతో మామిడి సీజన్ సన్నాహక సమావేశం నిర్వహించారు. సీజన్‌లో ఎదురయ్యే సమస్యలు, వాటి పరిష్కారానికి ముందస్తు చర్యలపై చర్చించారు. వ్యాపారులు, అధికారుల నుంచి సలహాలు, సూచనలు తీసుకున్నారు.

మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. వ్యాపారులు అధిక కమీషన్ వసూలు చేస్తే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ఇతర రాష్ట్రాల నుంచి మార్కెట్‌కు వచ్చే రైతులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. మార్కెట్‌లోని వ్యాపారులు, రైతుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్ ఇన్‌స్పెక్టర్ అంజిరెడ్డి, ట్రాఫిక్ సీఐ గట్టు మల్లు, ఫైర్ స్టేషన్ సీఐ యాదగిరి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కరాచారి, మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి శ్రీనివాస్, డైరెక్టర్లు మధుసూదన్‌రావు, రఘుపతిరెడ్డి, జైపాల్‌రెడ్డి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

రోజు విడిచి రోజు నీరు సరఫరా చేయాలి

సరూర్‌నగర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లెలగూడలో పలు కాలనీలకు నాలుగైదు రోజులకు నీటి సరఫరా చేస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, రోజు విడిచి రోజు సరఫరా చేయాలని మాజీ కార్పొరేటర్లు పోరెడ్డి పద్మాభాస్కర్‌రెడ్డి, గజ్జెల రాంచందర్ జలమండలి అధికారులను కోరారు. సోమవారం సాహెబ్‌నగర్‌లోని జలమండలి కార్యాలయంలో సంబంధిత అధికారికి వినతిపత్రం అందజేశారు.

'శ్రీశ్రీహోమ్స్‌లో స్థలాలను రక్షించండి'

సరూర్‌నగర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): అల్మాస్‌గూడలోని శ్రీశ్రీహోమ్స్ కాలనీలో ఖాళీ స్థలాలను వెంచర్ నిర్వాహకుడు/బిల్డర్ కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నాడని, స్థలాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని స్థానిక కాంగ్రెస్ నాయకుడు మల్లారెడ్డి అధికారులను కోరారు. సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్, బడంగ్‌పేట్ మునిసిపల్ కమిషనర్‌కు వినతిపత్రాలు అందజేశారు.

మాజీ మేయర్‌కు సన్మానం

సరూర్‌నగర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ సాయినగర్ ఫేజ్-2 కాలనీలో సోమవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో మాజీ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డిని ఘనంగా సన్మానించారు. కాలనీ సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లగా పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వృద్ధులు, దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీకి నేటి నుంచి ప్రత్యేక శిబిరాలు

ఎల్బీనగర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఆర్టిఫిషియల్ లింబ్ మాన్యుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సహకారంతో వయోవృద్ధులు, దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీకి ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నామని రంగారెడ్డి జిల్లా సంక్షేమ అధికారి సంధ్యారాణి తెలిపారు. ఈ నెల 4న చేవెళ్లలోని అట్లాస్ మినీహాల్, 5న సరూర్‌నగర్‌లోని జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ కార్యాలయం, 6న శంషాబాద్‌లో మహిళా మండలి కమ్యూనిటీ హాల్‌లో ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తుదారులు కనీసం 40 శాతం దివ్యాంగ ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, యూడీఐడీ కార్డు సమర్పించాలన్నారు.

9 మంది పేకాటరాయుళ్లపై కేసు

మన్సూరాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పేకాట స్థావరంపై నాగోల్ పోలీసులు దాడి చేశారు. 9 మందిపై కేసు నమోదు చేశారు. ఘట్‌కేసర్‌కు చెందిన వ్యాపారి ఎండూరి కృష్ణయ్య బండ్లగూడ ఆనంద్‌నగర్‌లోని సహభావన అపార్ట్‌మెంట్‌లో గుట్టుచప్పుడు కాకుండా పేకాట స్థావరం నిర్వహిస్తున్నాడు. సమాచారమందుకున్న పోలీసులు సోమవారం అపార్ట్‌మెంట్‌పై దాడిచేశారు. కృష్ణయ్యతోసహా తొమ్మిదిమందిని అదుపులోకి తీసుకొని ఉప్పల్ ఎమ్మార్వో ఎదుట బైండోవర్ చేశారు. వారి నుంచి 9 సెల్‌ఫోన్లు, రూ. 74,090 స్వాధీనం చేసుకున్నారు.

రూ. 20 లక్షలు విద్యుత్ బిల్లులు కాజేసిన లైన్‌మన్ సస్పెన్షన్

సైదాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లులు కాజేసిన లైన్‌మన్‌ను అధికారులు సస్పెండ్ చేశారు. ఆస్మాన్‌గఢ్ సెక్షన్ లైన్‌మన్ రత్నాకర్‌రెడ్డి గడ్డిఅన్నారం డివిజన్ మధురాపురి కాలనీలోని ప్రైవేట్ హాస్టళ్ల నుంచి విద్యుత్ బిల్లులు వసూలు చేసి తన ఖాతాలో జమచేసుకుంటున్నాడు. సుమారు 20 లక్షలు సంస్థ సొమ్ము కాజేశాడు. హాస్టళ్ల విద్యుత్ బిల్లుల బకాయిలు భారీగా ఉండడంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దీంతో హాస్టళ్ల నిర్వాహకులు అధికారులను సంప్రదించగా విషయం వెలుగులోకి వచ్చింది. విచారణ చేపట్టిన అధికారులు లైన్‌మైన్ రత్నాకర్ రెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు చేసి సస్పెండ్ చేశారు. ఈ వ్యవహారంలో కొంతమంది అధికారులు, సిబ్బంది పాత్రపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టినట్టు తెలిసింది. లైన్‌మన్ కొన్నేళ్లుగా క్యాజువల్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు.



ఎల్ఆర్ఎస్ అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించుకోండి

ఎల్బీనగర్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్‌ఎంసీ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్ సూచించారు. మంగళవారం గడ్డిఅన్నారంలోని శ్రీసాయి ఫంక్షన్‌హాల్‌లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 2020లో ఎల్ఆర్ఎస్ కోసం చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించడానికి ప్రభుత్వం మరో అవకాశం ఇచ్చిందన్నారు. నిర్ణీత రుసుము చెల్లించి ఈనెల 31లోగా దరఖాస్తులను పరిష్కరించుకోవాలని సూచించారు. ఎల్ఆర్ఎస్ ఫీజు మొత్తం ముందే కట్టించుకోకుండా దరఖాస్తు పరిశీలించిన తర్వాత కట్టించుకోవాలని పలువురు కోరారు. దరఖాస్తుదారుల సందేహాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎల్బీనగర్ జోన్ సిటీ ప్లానర్ ఆర్. శ్రీనివాస్‌యాదవ్, రంజిత్‌కుమార్, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు శ్యాంసన్, ప్రతాప్, ముంతాజ్‌బేగం పాల్గొన్నారు.

భరత్‌నగర్ బస్తీలో సమస్యలు పరిష్కరించాలి

కొత్తపేట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): భరత్‌నగర్ బస్తీలో సమస్యలు పరిష్కరించాలని సంక్షేమ సంఘం అధ్యక్షులు మామిడి రాంచందర్ ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి విన్నవించారు. సోమవారం ఎమ్మెల్యేను కలిసి బస్తీ సమస్యలను వివరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కొత్తపేట డివిజన్ అధ్యక్షుడు లింగాల రాహుల్‌గౌడ్, భరత్‌నగర్ సంక్షేమ సంఘం కార్యదర్శి ఆకుల వెంకటేష్, సంయుక్త కార్యదర్శి ఎం.మల్లేష్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న రాంచందర్

స్వర్ణకారుల సంక్షేమానికి సహకారం

వనస్థలిపురం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): స్వర్ణకారుల సంక్షేమానికి తనవంతు సహకారం అందజేస్తానని బీఆర్ఎస్ బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవిందరెడ్డి అన్నారు. సోమవారం సెల్ఫ్‌ఫైనాన్స్ కాలనీలో వనస్థలిపురం స్వర్ణకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న భవన నిర్మాణపు పనులకు శంకుస్థాపన చేశారు. స్వర్ణకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కన్నెకంటి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ఎం. నర్సింహాచారి, కాలనీ అధ్యక్షుడు వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి నిట్టు కృష్ణ పాల్గొన్నారు.